TG/TEL/25/A3731

# నిజం

దృష్టి తెలుగు న్యూస్

WANTED

రిపోర్టర్లు కావలెను

నిజం దృష్టి తెలుగు న్యూస్

దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-153 | పేజీలు:-4 | శుక్రవారం 15- 05 - 2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## మంత్రి సీతక్కకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విజ్ఞప్తి



★ స్త్రీ నిధిలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలన్న కవిత

★ స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన ఎండీపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

★ సంస్థను తన గుప్పెట్లో పెట్టుకోవడానికి ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశాడని ఆరోపణ

మంత్రి సీతక్కకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక విజ్ఞప్తి చేశారు. ఆమె శాఖలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలని - మిగతా 2 లో

# నీట్ పరీక్ష రద్దుపై రేవంత్ రెడ్డి స్పందన

▶▶ పేపర్ లీక్ తో నీట్ పరీక్ష రద్దు

▶▶ పారదర్శకమైన విచారణ జరపాలన్న రేవంత్ రెడ్డి

▶▶ పోటీ పరీక్షలు విద్యార్థుల జీవితాలను నాశనం చేయకూడదని వ్యాఖ్య




నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు, పేపర్ లీక్ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంపై కేంద్రం పారదర్శకమైన విచారణ

## ఫార్ములా ఈ-కార్ రేసు

కేటీఆర్ కు నోటీసులు

❖ కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు

❖ జూలై 31న విచారణకు హాజరు కావాలని ఆదేశం

❖ ఫార్ములా ఈ రేస్ కేసులో ఏ1గా కేటీఆర్



ఫార్ములా ఈ-కార్ రేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ - మిగతా 2 లో

## ఫతా-4 మిస్సైల్ ను ప్రయోగించిన పాక్

➤ మన దేశ రాజధానిని టార్గెట్ చేసే మిస్సైల్ ను పరీక్షించిన పాక్

➤ తక్కువ ఎత్తులో ప్రయాణిస్తూ శత్రువుల రాడార్లను కన్నుగప్పే సామర్థ్యం

➤ అత్యంత కచ్చితత్వంతో టార్గెట్లను ఛేదించగలదంటున్న పాక్ ఆర్మీ



పాకిస్థాన్ సైన్యం తన బలాన్ని ప్రదర్శిస్తూ భారత్‌లోని ప్రధాన నగరాలను లక్ష్యంగా చేసుకోగల సామర్థ్యం ఉన్న 'ఫతా-4' క్రూయిజ్ మిస్సైల్‌ను విజయవంతంగా పరీక్షించినట్టుగా పాకిస్థాన్ మీడియా నుంచి వార్తలు వస్తున్నాయి. భారత రక్షణ రంగంలోని బ్రహ్మోస్ క్షిపణికి పోటీగా దీనిని పాకిస్థాన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్ కమాండ్ అభివృద్ధి చేసింది. ఈ క్షిపణి యొక్క ప్రధాన విశిష్టత ఏమిటంటే, - మిగతా 2 లో

## 'మనమిద్దరం కలిసుంటే ఈ ప్రపంచమే ప్రత్యేకం'

జిన్‌పింగ్‌తో ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు !



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య జరిగిన బీజింగ్ శిఖరాగ్ర సదస్సు అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనలో భాగంగా చైనా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఘనమైన విందులో ట్రంప్ మాట్లాడుతూ అమెరికా - చైనా సంబంధాలను ఆకాశానికెత్తారు. "మనమిద్దరం కలిసి ఉంటే ప్రపంచం చాలా ప్రత్యేకం" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యాన్ని చాటిచెప్పాయి. చైనా అధ్యక్షుడితో కలిసి ప్రపంచ సమస్యలపై పనిచేయడం గౌరవంగా భావిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ విందులో ట్రంప్ తన మనవరాలు అరబెల్లా కుష్నర్ చైనీస్ భాషలో పాట పాడుతున్న వీడియోను ప్రదర్శించారు. దీనిని చూసి జిన్‌పింగ్ తో పాటు అక్కడి అతిథులు ఎంతో ఆనందించారు. ఇరు దేశాల స్నేహం సరికొత్త పుంతలు తొక్కాలని - మిగతా 2 లో

# అన్ని మతాలు ఒక్కటే

▶▶ కడప దర్గాకు వెళ్లా: సీఎం విజయ్ పాత ఇంటర్వ్యూ వైరల్

▶▶ తమిళనాడు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నటుడు విజయ్

▶▶ తన వ్యక్తిగత జ్యోతిషుడిని ఓఎస్డీగా నియమించడంతో తొలి వివాదం

▶▶ విమర్శల నేపథ్యంలో వైరల్ అవుతున్న విజయ్ పాత ఇంటర్వ్యూ

▶▶ అన్ని ప్రార్థనా స్థలాల్లో ఒకే దివ్యమైన అనుభూతి కలుగుతుందన్న విజయ్

▶▶ కడపలోని అమీన్‌పీర్ దర్గాను కూడా సందర్శించినట్లు గతంలో వెల్లడి




తమిళనాడు ముఖ్యమంత్రిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్, బాధ్యతలు చేపట్టిన తొలిరోజే వివాదంలో చిక్కుకున్నారు. మే 10న సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన ఆయన, తన వ్యక్తిగత జ్యోతిషుడు రిక్కీ రాధన్ పండిట్ వేత్రివేల్‌ను ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా ఒక కీలక పరిపాలనా పదవిలో నియమించడం తీవ్ర దుమారం రేపింది. శాస్త్రీయ దృక్పథంతో నడవాల్సిన ప్రభుత్వంలో జ్యోతిషుడికి ఉన్నత పదవి ఇవ్వడంపై విపక్షాలు, హేతువాదుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అయినప్పటికీ ఈ విమర్శలను పక్కనపెట్టి

## లాయర్ దుస్తుల్లో హైకోర్టుకు వచ్చిన మమతా బెనర్జీ



★ ఎన్నికల తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై కేసు

★ తనపై వచ్చిన ఆరోపణలను ఎదుర్కోవడానికి స్వయంగా రంగంలోకి దిగిన మమత

★ ద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా మమత పోరాడుతారన్న టీఎంసీ

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేడు కోల్‌కతా హైకోర్టులో విచారణకు హాజరయ్యారు. న్యాయవాది గౌను ధరించి ఆమె కోర్టుకు వచ్చారు. బెంగాల్ - మిగతా 2 లో

## చట్టాన్ని ధిక్కరించే ధైర్యం ఆ కంపెనీలకు ఎలా వచ్చింది?



★ ఆక్వా ఫీడ్ ధరల పెంపు అంశంపై జగన్ స్పందన

★ ఫీడ్ కంపెనీలతో కూటమి ప్రభుత్వం కుమ్మక్కైందంటూ తీవ్ర విమర్శలు

★ ధరలు తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలంటూ డిమాండ్

★ లేకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరిక

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా ఫీడ్ ధరల పెంపు అంశంపై రాజకీయ దుమారం రేగుతోంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ - మిగతా 2 లో

## ఏపీ పీజీఈసెట్ ఫలితాలు విడుదల



❖ 9,990 మంది పరీక్షలు రాయగా 9,320 ఉత్తీర్ణులైనట్లు లోకేశ్ వెల్లడి

❖ ఉత్తీర్ణత శాతం 93.29 శాతంగా నమోదు

❖ అధికారిక వెబ్ సైట్‌లో అందుబాటులో ర్యాంకు కార్డులు

❖ వాట్సాప్ నెంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలు తెలుసుకోవచ్చు

ఉన్నత విద్యా ప్రవేశాలకు నిర్వహించే ఏపీ పీజీఈసెట్-2026 ఫలితాలు - మిగతా 2 లో

# పన్ను ఎగవేతలకు ఏఐ అస్త్రం

ఆదాయ వృద్ధికి సీఎం చంద్రబాబు కొత్త వ్యూహం

▶▶ పన్ను ఎగవేతలను అరికట్టేందుకు ఏఐ టెక్నాలజీ వినియోగం

▶▶ 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.1,27,506 కోట్ల ఆదాయం లక్ష్యం

▶▶ ఖనిజాలకు విలువ జోడించి ఆదాయం పెంచుకోవాలని సూచన

▶▶ పన్ను చెల్లింపుదారులను వేధించకుండా టెక్నాలజీతో వసూళ్లు చేయాలని ఆదేశం

▶▶ ఎర్రచందనం ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించేలా ప్రణాళిక




పన్ను ఎగవేతలను అరికట్టి, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న లీకేజీలను సమూలంగా మూసివేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని ఒక ఆయుధంగా వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, గనులు, రవాణా వంటి కీలక శాఖల్లో ఏఐ ఆధారిత టూల్స్ వాడటం ద్వారా పన్ను ఎగవేతలను గుర్తించి, నిబంధనల ఉల్లంఘనలను నివారించాలని స్పష్టం చేశారు. ఏఐ ఆధారిత

నిజం
దృష్టి తెలుగు న్యూస్
TG/TEL/25/A3731
శుక్రవారం 15- 05 - 2026

# ఏపీ పీజీఈసెట్ ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి – విడుదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమ వేదికల ద్వారా వీటిని విడుదల చేశారు. 9,990 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 9,320 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఉత్తీర్ణత శాతం 93.29 శాతంగా ఉంది. ర్యాంకు కార్డులు అధికారిక వెబ్ సైట్ **https://cets.apsche.ap.gov.in/PGECET/PGECET/PGECET_HomePage.aspx** లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్ టిక్కెట్ నెంబర్‌లను ఎంటర్ చేసి ఫలితాలు తెలుసుకోవచ్చు. ఈ పోర్టల్ నుంచి ఫలితాలను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. వాట్సాప్ నెంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలు తెలుసుకోవచ్చని సూచించారు. ఏపీ పీజీఈసెట్–2026లో అర్హత సాధించిన విద్యార్థులకు మంత్రి లోకేశ్ అభినందనలు తెలియజేశారు.

## మంత్రి సీతక్కకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి – కోరారు. స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ మేరకు కవిత 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పాటునివ్వాల్సిన స్త్రీనిధి సంస్థ అక్రమార్కులకు అడ్డంగా మారిందని ఆరోపించారు. సంస్థను తన గుప్పెట్లో పెట్టుకుని అనేక అక్రమాలకు కారకుడైన ఎండీ, ఇప్పుడు దొడ్డిదారిన సంస్థకు ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో ఈ నెల 16వ తేదీన స్త్రీనిధి ఉద్యోగుల సమావేశంలో ఎక్స్ అఫీషియో చైర్మన్ పోస్టును తీసుకోవడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని పేర్కొన్నారుసదరు ఎండీ పదవీకాలం ఈ నెల 23వ తేదీతో ముగియనుందని, దీంతో ఆయన సంస్థను ఎలాగైనా తన అధీనంలోనే ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమార్కులను దొడ్డిదారిలో కీలక పోస్టుల కొనసాగించేందుకు ఎంతకైనా దిగజారుతోందని విమర్శించారు. తన శాఖలో జరుగుతున్న అక్రమాలపై మంత్రి సీతక్క స్పందించాలని కోరారు. స్త్రీ నిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్త్ర నిధిలో నియామకాలు పారదర్శకంగా జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

# ఫార్ములా ఈ–కార్ రేసు

మొదటిపేజీ తరువాయి – కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్విండ్ కుమార్, ఏ3 హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావులకు సమన్లు జారీ అయ్యాయి. జూలై 31వ తేదీన విచారణకు హాజరు కావాలని ఏసీబీ కోర్టు అందులో పేర్కొంది. ఈ కేసులో కేటీఆర్ ఏ1గా ఉన్నారు. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ–కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ చార్జ్‌షీట్‌లో పేర్కొంది.

# నీట్ పరీక్ష రద్దుపై రేవంత్ రెడ్డి స్పందన


మొదటిపేజీ తరువాయి – జరపాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్ష రద్దు నిర్ణయంతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇలాంటి ఘటనలు పరీక్షల వ్యవస్థపై ఉన్న విశ్వసనీయతను దెబ్బతీస్తాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పేపర్ లీక్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, విద్యార్థులు మళ్లీ ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణమే పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. పోటీ పరీక్షలు అనేవి విద్యార్థుల ప్రతిభకు వేదిక కావాలి తప్ప, వారి జీవితాలను నాశనం చేసే సాధనాలుగా మారకూడదని ఆయన హితవు పలికారు. ఇదే సమయంలో ఆయన రాజకీయంగా కూడా విమర్శలు గుప్పించారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీక్ ఘటనల విషయంలో గత ప్రభుత్వ తీరు, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ వైఖరి ఒకేలా ఉందంటూ రేవంత్ రెడ్డి చురకలు అంటించారు.

# ఫతా-4 మిస్సైల్ ను ప్రయోగించిన పాక్

మొదటిపేజీ తరువాయి – ఇది భూమికి సమాంతరంగా అతి తక్కువ ఎత్తులో ప్రయాణిస్తూ శత్రువుల రాడార్ వ్యవస్థల కళ్లుగప్పి లక్ష్యాన్ని చేరుకోగలదు. అత్యాధునిక ఏవియానిక్స్ మరియు నావిగేషన్ వ్యవస్థలతో రూపొందించబడిన ఈ క్రూయిజ్ మిస్సైల్, సుదూర ప్రాంతాల్లోని లక్ష్యాలను సైతం అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదని పాక్ సైనిక వర్గాలు వెల్లడించాయి. సాంకేతిక సామర్థ్యం పరంగా చూస్తే, ఫతా–4 క్షిపణి సుమారు 750 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉండి, 330 కిలోగ్రాముల బరువున్న వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదు. ఈ క్షిపణి పరిధి భారత్‌కు ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఎందుకంటే పాకిస్థాన్‌లోని సరిహద్దు ప్రాంతాలైన లాహోర్ లేదా సియాల్ కోట్ నుండి దీనిని ప్రయోగిస్తే, భారత రాజధాని ఢిల్లీ మరియు ఎన్‌సీఆర్ ప్రాంతం నేరుగా దీని లక్ష్య పరిధిలోకి వస్తాయి. వీటితో పాటు పంజాబ్, జమ్మూ కశ్మీర్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, ఆగ్రా వంటి ప్రధాన నగరాలకు కూడా ఈ క్షిపణి ముప్పు పొంచి ఉంది. భారత్ ఇప్పటికే తన వద్ద ఉన్న ఎస్–400 (ఎా–400) వంటి అత్యాధునిక రక్షణ వ్యవస్థలతో ఇటువంటి క్షిపణులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, పాక్ చేస్తున్న ఈ ప్రయోగాలు సరిహద్దుల్లో ఉద్రిక్తతలను పెంచే అవకాశం ఉంది.

# పొదుపు సూత్రాల వెనుక వైఫల్యాలు

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో భవిష్యత్తులో భారత్ పెను ప్రభావాలకు లోనవుతున్నదని, ప్రజలంతా పొదుపు సూత్రాలు పాటించాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. దేశభక్తి ప్రదర్శిస్తూ దేశాభివృద్ధికి తోడ్పడాలని ఉపదేశాలు ఇవ్వడంతో యావత్ దేశం ఉలిక్కిపడింది. జీఎస్టీ తగ్గించాం.. వస్తువులు కొనండి, దీపావళి, విజయదశమి పండుగ సంబరాల్లో మునగండని, నిన్నమొన్నటివరకు దేశం మూడో ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుందని ప్రగల్భాలు పలికిన ప్రధాని హఠాత్తుగా యూటర్న్ తీసుకున్నారు. 'బంగారం కొనొద్దు, విదేశీ ప్రయాణాలు చేయొద్దు, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ఆదా చేయండి, రైతులు ఎరువులను, ప్రజలు వంట నూనెలను తక్కువగా వాడాలంటూ ' అంటూ పొదుపు సూత్రాలు వల్లించారు. ప్రధాని మోదీ స్వభావాన్ని పన్నెండేండ్లు గా గమనిస్తే ఒక విషయం స్పష్టంగా అర్థమవుతున్నది. విజయం ఆయన ఖాతాలో, వైఫల్యాలను ఇతరుల ఖాతాలో జమ చేయడం ఆయన థియరీ. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమై సుమారు రెండున్నర నెలలు గడుస్తు న్నా, యుద్ధంతో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకకు మోదీ సరైన చర్యలు తీసుకోలేదు. దాదాపు 80% శాతం చమురు, గ్యాస్ వంటివి ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటాం. ఇందులో అత్యధికంగా హొర్ముజ్ జలసంధి ద్వారా మనకు చేరుతాయి. అయినా ప్రధాని దృష్టి సారించలేదు. పశ్చిమాసియా సంక్షోభం, రాబోయే కాలం లో భారత్ ఎదుర్కొనే గ్యాస్, చమురు, ఎరువులు, వంట నూనెల కొరత, ముఖ్యంగా విదేశీమారక నిల్వలు తగ్గుదల వంటి పలు సమస్యల పరిష్కారం కోసం అని చెప్తూ ప్రజలకు ప్రధాని పొదుపు సూత్రాలు బోధించారు. ఇటువంటి సమస్యలు వస్తాయని ఆయనకు ముందే తెలుసు. కానీ డబుల్ ఇంజిన్ సర్కార్‌లు ఏర్పాటు చేయడానికి, ఎన్నికల్లో కల్లబొల్లి కబుర్లు, విభజన రాజకీయాలు చేసి, వారు అనుకున్న రాష్ట్రాల్లో అధికారం కోసం వాస్తవాలు దాచిపెట్టారు. దేశ ఆర్థిక పరిస్థితిపై నిజాలు దాచటం ఎంతవరకు సమంజసం? ఒక్కమాటలో చెప్పాలంటే ప్రజలను మోసం చేయటమే! ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తకుండా దేశభక్తి, మత క్రతువుల పేరుతో తప్పించుకోవటం బీజేపీ నేతలకు అలవాటే. ప్రజలు, ముఖ్యంగా జెన్‌జీ యువత ఈ విషయం గ్రహించాలి. పెద్దవాళ్లు యువతకు అర్థమయ్యేలా చెప్పాలి. 2016లో అర్ధరాత్రి ఆగమేఘాలపై ప్రధాని మోదీ పెద్దనోట్లను రద్దు నిర్ణయం ప్రకటించారు. అప్పుడు ప్రారంభమైన దేశ ఆర్థిక వ్యవస్థ పతనం, కోవిడ్ కాలంలో మరింత క్షీణించింది. ఇటీవలి కాలంలో రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, ట్రంప్ ప్రతీకార సుంకాలు, వలస వ్యతిరేక విధానాలు, తాజాగా అమెరికా–ఇరాన్ యుద్ధంతో మన దేశం అన్నిరంగాల్లో వెనుకబాట పట్టడంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి దాపురించింది. నిన్నమొన్నటి వరకు దేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతున్నదని, జీడీపీ, బిలియనీర్ల సంఖ్య పెరుగుతున్నదని గొప్పలు చెప్పుకొని జబ్బలు చరుచుకున్న కేంద్ర పాలకులు యూటర్న్ తీసుకున్నారు. ఆర్థిక రంగ వైఫల్యంపై ఆరోపణల నుంచి బయటపడేందుకు ప్రధాని పొదుపు సూత్రాలు వల్లించారు.ఎన్నికలు అయిపోయాయి కనుక అతి త్వరలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే అవకాశం ఉన్నది. ఇక నిత్యావసర వస్తువులు, ఎరువుల ధరలు పెరిగి, దేశ ప్రజానీకం యావత్తు బతకడానికి ముప్పుతిప్పలు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇదేనా మోదీ పన్నెండేండ్ల పాలనలో ప్రజలకు ఇచ్చే అచ్చేదిన్? ఏమి కొనాలి, ఏమి తినాలి అనే స్థాయికి దేశం దిగజారింది. నిరుద్యోగం, అధిక ధరలు, ద్రవ్యోల్బణం, ఉపాధి లేమితో లక్షలాది కుటుంబాలు కునారిల్లుతున్నాయి. పుండుమీద కారం చల్లినట్టు మోదీ పొదుపు సూత్రాలు ప్రజల్లో మరిన్ని భయాలు సృష్టిస్తున్నాయి. అరవై ఏండ్లపాటు కాంగ్రెస్ పాలనలో దేశం ఏమీ అభివృద్ధి చెందలేదని చెప్పి, 2014లో కేంద్రంలో గద్దెనెక్కిన మోదీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ పన్నెండేండ్ల పాలనలో ఏమి సాధించిందో ఇకనైనా తెలుపాలి. 2014లో రూపాయి మారకం విలువ 58 రూపాయలుగా ఉంటే.. నేడు 95.80కు పతనమైంది. మోదీ అధికారం చేపట్టే నాటికి విదేశీ రుణం 446 బిలియన్ డాలర్లు ఉంటే.. నేడు 755 బిలియన్ డాలర్లకు చేరుకున్నది.




నాడు ప్రతీ భారతీయుడిపై రూ.48,296 అప్పు ఉంటే.. ఇప్పుడు రూ.1,48,000 ఉన్నది. దేశంలో ఏదైనా సంక్షోభం వస్తే చేతులెత్తేయడం, నీట్‌గా దేశభక్తి ముసుగు తొడిగి మోదీ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఐదేండ్ల క్రితం కొవిడ్ కాలంలో, నేడు పశ్చిమాసియా సంక్షోభంలో ఇదే ధోరణిని మోదీ ప్రదర్శిస్తున్నారు. ఆత్మనిర్భర్ భారత్, గతిశక్తి, స్వచ్ఛ భారత్, మేకిన్ ఇండియా, వికసిత్ భారత్ వంటి నినాదాలతో దేశం పరుగులు పెడుతున్నదని లేని గొప్పలు చెప్పుకోవటం పరిపాటిగా మారింది. సమస్యలు, సంక్షోభాలు ఏర్పడితే చాకచక్యంగా వ్యవహరించి తప్పించుకుంటున్నారు. మోదీ పాలనలో కార్పొరేట్ దిగ్గజాలు భారీ సంపదను పోగేసుకుంటున్నాయి. కానీ దేశంలో సుమారు 80 శాతం ఉన్న పేద, మధ్యతరగతి ప్రజల తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు ఏమీ మెరుగుపడలేదని పలు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని పాలకులకు ధ్యాస లేదు. అందువల్లనే మన దేశాభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ గాలిబుడగలా తయారైంది. ఇకనైనా ప్రజలు, యువ త పాలకుల విధానాలను, అసలు రంగును గ్రహించాలి. తమ జీవితాలకు, తలసరి ఆదాయం జీవన ప్రమాణాలు మెరుగుకు కృషి చేసే వారికి అధికారం ఇవఇవ్వడానికి తమ వంతు పాత్ర పోషించాలి. కుల, మత, వర్గ, ప్రాంతీయ భాషా తదితర అంశాల ఆధారంగా ఓట్లు దండుకునే పార్టీలను, నేతలను దూరంగా ఉంచడం మంచిది. జెన్‌జీ యువత తమ ఆకాంక్షలు నెరవేర్చే వారికే అధికారం ఇవ్వాలి. కట్టబెట్టడం ద్వారానే వికసిత్ భారత్ సాధ్యం. పౌర సమాజమా..నేటి పాలకుల విధానాలు వాస్తవరూపంలో విశ్లేషణ చేయాలి. మహనీయుడు లెనిన్ ఇలా చెప్పాడు 'పాలకుల విధానాలు, మాటల్లోని అంతరార్థం ప్రజలు గ్రహించలేనంత కాలం మళ్లీ మళ్లీ మోసపోతూనే ఉంటారు'. సుమారు శతాబ్దం క్రితం ఆయన చెప్పిన మాటలు నేటికీ వాస్తవమే కదా!

# పన్ను ఎగవేతలకు ఏఐ అస్త్రం

మొదటిపేజీ తరువాయి – జీఎస్టీ రిటర్న్ స్క్రూటినీ వంటి విధానాలతో పారదర్శకత పెంచాలని, అయితే పన్ను చెల్లింపుదారులను ఎలాంటి వేధింపులకు గురిచేయకుండా టెక్నాలజీ సాయంతో వసూళ్లు జరపాలని ఆయన దిశానిర్దేశం చేశారు. గురువారం సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1,27,506 కోట్ల భారీ ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, దానికి అనుగుణంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. గడిచిన 2025–26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత ఆదాయం రూ.1,10,643 కోట్లుగా నమోదైందని, ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 6 శాతం అధికమని అధికారులు సీఎంకు వివరించారు. ఈ వృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలని చంద్రబాబు అన్నారు. పొరుగు రాష్ట్రాల ఆదాయ పద్ధతులను విశ్లేషించి, మన రాష్ట్రంలోనూ ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు.

**విలువ జోడింపుతో ఖనిజాలకు కొత్త కళ**

రాష్ట్రంలో ఉన్న సహజ వనరులను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. ఖనిజాలకు విలువ జోడింపు (వాల్యూ అడిషన్) చేయడం ద్వారా గనుల శాఖ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా ప్రపంచంలోనే అరుదైన ఎర్రచందనాన్ని అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయించేలా చూడాలని, దాని నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా రాష్ట్రానికి భారీ ఆదాయం సమకూరుతుందని చెప్పారు. అలాగే, రేర్ ఎర్త్ మినరల్స్ ద్వారా కూడా గనుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**పెట్టుబడులకు అనుగుణంగా ఆదాయం పెరగాలి**

రాష్ట్రానికి పెద్ద ఎత్తున వస్తున్న పెట్టుబడులకు అనుగుణంగా పన్నుల రూపంలో ఆదాయం కూడా పెరగాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పెట్టుబడులు వాస్తవరూపం దాల్చుతున్న కొద్దీ జీవీఏ, ఆదాయాలు పెరగాలన్నారు. జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని గ్రోత్ రేట్ లక్ష్యాలను నిర్దేశించుకుంటే, రాష్ట్రవ్యాప్త లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖలో లావాదేవీలు పెరుగుతున్నాయని, 22ఏ వంటి భూ వివాదాలు పరిష్కారమైతే ఆదాయం మరింత పెరుగుతుందని అంచనా వేశారు. వాహనాల రిజిస్ట్రేషన్లను 24 గంటల్లో పూర్తి చేయాలని, ఈవీ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని రవాణా శాఖకు సూచించారు. పురపాలక, పంచాయతీరాజ్ శాఖల్లో పన్నుల వసూళ్లను క్రమబద్ధీకరించాలని, జీఐఎస్, డ్రోన్ సర్వేల ద్వారా అక్రమ నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ ఆదాయంలో ప్రతీ రూపాయి సద్వినియోగం కావాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు కీలక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చట్టాన్ని ధిక్కరించే ధైర్యం ఆ కంపెనీలకు ఎలా వచ్చింది?

మొదటిపేజీ తరువాయి – కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఫీడ్ కంపెనీలతో ప్రభుత్వం కుమ్మక్కై, కమీషన్ల కోసం ఆక్వా రైతులను దారుణంగా దోచుకుంటోందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పెంచిన ధరలను తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని జగన్ హెచ్చరించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలతో పాటు ఆక్వా రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని జగన్ విమర్శించారు. "మీ పరిపాలనలో దోపిడీకి ఏ రంగమూ మినహాయింపు కాదు. చివరకు ఆక్వా ఫీడ్ ధరల విషయంలో కంపెనీలతో కుమ్మక్కై ఆక్వా రైతులను కూడా దోచుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు. ఫీడ్ కంపెనీల యాజమాన్యాలు టీడీపీ సానుభూతిపరులని, కమీషన్ల కోసం వారితో చంద్రబాబు లాలూచీ పడ్డారని, అందుకే వారు అడ్డగోలుగా ధరలు పెంచుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉందని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులను సిండికేట్ల నుంచి, దళారుల బారి నుంచి కాపాడేందుకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చి, ముఖ్యమంత్రి చైర్మన్‌గా 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ' (ఏపీఎస్ఏడీఏ)ని ఏర్పాటు చేశామని జగన్ గుర్తుచేశారు. ఈ సంస్థ ద్వారా సీడ్, ఫీడ్ నాణ్యత, ధరలను నియంత్రించడంతో పాటు, ఆక్వా ఉత్పత్తులకు ప్రభుత్వమే ధర నిర్ణయించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. దీనికితోడు, ఆక్వా రైతులకు యూనిట్ కరెంటును కేవలం రూ.1.50కే అందించి అండగా నిలిచామని పేర్కొన్నారు. అయితే, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్దేశపూర్వకంగానే ఏపీఎస్ఏడీఏను నిర్వీర్యం చేసి, తమ ప్రభుత్వ చర్యలన్నింటినీ నీరుగార్చిందని విమర్శించారు. ఏపీఎస్ఏడీఏ అనుమతి లేకుండా కంపెనీలు ధరలు పెంచాయని ప్రభుత్వం ఇప్పుడు చెప్పడం ప్రజల చెవిలో పువ్వులు పెట్టడానికేనని జగన్ ఎద్దేవా చేశారు. "ఒక ప్రభుత్వాన్ని, చట్టాన్ని ధిక్కరించే ధైర్యం ఆ కంపెనీలకు ఎలా వచ్చింది? వాళ్లు మీవాళ్లు కాబట్టే కదా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఫీడ్ ధరల పెంపును తాత్కాలికంగా నిలిపివేశామంటూ ప్రభుత్వం మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని హితవు పలికారు. పెంచిన ధరలను పూర్తిగా వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని, రైతుల పక్షాన వైసీపీ అండగా నిలుస్తుందని జగన్ స్పష్టం చేశారు.

# 'మనమిద్దరం కలిసుంటే ఈ ప్రపంచమే ప్రత్యేకం'

మొదటిపేజీ తరువాయి – షీ జిన్‌పింగ్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కేవలం వాణిజ్యం మాత్రమే కాకుండా ఇతర అంతర్జాతీయ రాజకీయ అంశాలపై కూడా ఇద్దరు నేతలు ఎంతో లోతుగా చర్చలు జరిపారు. ఈ శిఖరాగ్ర సమావేశం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి ఎంతో తోడ్పడుతుందని ఇద్దరు నేతలు బలంగా అభిప్రాయపడ్డారు. ఇరు దేశాల బంధం భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుందని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు.

**ఉత్తర కొరియా అంశంపై ఒత్తిడి**

ఉత్తర కొరియా అణు పరీక్షల విషయంలో చైనా మరింత కఠినంగా వ్యవహరించాలని ట్రంప్ కోరారు. ఆ దేశంపై ఆర్థిక ఒత్తిడి పెంచాలని షీ జిన్‌పింగ్‌కు సూచించారు. ప్రాంతీయ శాంతి నెలకొల్పడానికి చైనా తన ప్రభావాన్ని వాడాలని విజ్ఞప్తి చేశారు. అణు ముప్పును అరికట్టడానికి ఇరు దేశాలు కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాయి.

**భారీ వాణిజ్య ఒప్పందాలు**

ఈ సదస్సులో కొన్ని బిలియన్ డాలర్ల విలువైన వ్యాపార ఒప్పందాలు కుదిరాయి. అమెరికా కంపెనీలకు చైనా మార్కెట్లో మరిన్ని అవకాశాలు కల్పించాలని ట్రంప్ కోరారు. గతంలో ఉన్న వాణిజ్య లోటును తగ్గించుకోవాలని ఇద్దరు నేతలు అంగీకరించారు. ఇరు దేశాల మధ్య వ్యాపార బంధం పరస్పర ప్రయోజనకరంగా ఉండాలని చర్చించారు.

**ఇద్దరు నేతల మధ్య స్నేహం**

ట్రంప్, జిన్‌పింగ్ మధ్య వ్యక్తిగత సాన్నిహిత్యం ఈ పర్యటనలో హైలైట్‌గా నిలిచింది. దౌత్యపరమైన అంశాలే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఇద్దరూ ఎంతో సాన్నిహిత్యంగా కనిపించారు. ఇది ఇరు దేశాల మధ్య ఉన్న విభేదాలను తగ్గించడానికి సహాయపడుతుందని నిపుణులు భావిస్తున్నారు. అమెరికా విదేశాంగ విధానంలో చైనాకు ఇస్తున్న ప్రాధాన్యతను ఈ పర్యటన స్పష్టం చేసింది.

# అన్ని మతాలు ఒక్కటే

మొదటిపేజీ తరువాయి – తమిళనాడు ప్రభుత్వం వేత్రివేల్ నియామకాన్ని అధికారికంగా ఖరారు చేసింది. ఆ తర్వాత 24 గంటల్లోనే యూటర్న్ తీసుకుని ఆయనను పదవి నుంచి తొలగించింది. ఈ వివాదం నేపథ్యంలో విజయ్ గతంలో తన విశ్వాసాలు, దైవభక్తిపై మాట్లాడిన ఒక పాత ఇంటర్వ్యూ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'బీస్ట్' సినిమా ప్రమోషన్‌లో భాగంగా దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్‌తో జరిపిన సంభాషణలో విజయ్ తన వ్యక్తిగత విశ్వాసాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన తల్లి హిందువు, తండ్రి క్రిస్టియన్ అని, వారిది ప్రేమ వివాహమని గుర్తుచేసుకున్నారు. తన తల్లిదండ్రులు తనపై ఏ విషయంలోనూ నిర్బంధం విధించలేదని, అదే స్వేచ్ఛను తాను తన పిల్లలకు ఇస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తాను ప్రగాఢ విశ్వాసమున్న భక్తుడినని విజయ్ స్పష్టం చేశారు. "చర్చికి వెళ్లడం నాకు మంచి అనుభూతిని ఇస్తుంది. కేవలం చర్చిలకే కాదు, పిల్లార్‌పట్టి వినాయక ఆలయానికి, తిరునల్లార్ ఆలయానికి కూడా వెళ్లాను. అన్నిచోట్లా ఒకే రకమైన దివ్యమైన అనుభూతి కలుగుతుంది" అని ఆయన అన్నారు. అంతటితో ఆగకుండా 'కత్తి' (2014) సినిమా షూటింగ్ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో ఉన్న ప్రసిద్ధ అమీన్‌పీర్ దర్గాను కూడా సందర్శించానని విజయ్ గుర్తుచేసుకున్నారు. "చర్చి, ఆలయం, దర్గా.. ఏ ప్రార్థనా స్థలానికి వెళ్లినా నాకు ఒకే రకమైన దైవిక భావన కలుగుతుంది" అని ఆయన ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

**సీఎం విజయ్ కీలక నిర్ణయం.. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్**

తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగులకు కరవు భత్యం పెంపుడీఏను 58 శాతం నుంచి 60 శాతానికి పెంచిన విజయ్ సర్కార్ ఈ నిర్ణయంతో 16 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి ప్రభుత్వంపై ఏటా రూ.1,230 కోట్ల అదనపు భారం 2026 జనవరి 1 నుంచే ఈ పెంపు వర్తింపు తమిళనాడులోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వం గురువారం శుభవార్త అందించింది. వారి కరవు భత్యాన్ని (డీఏ) 2 శాతం పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో డీఏ 58 శాతం నుంచి 60 శాతానికి పెరిగింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు డీఏను 58 శాతం నుంచి 60 శాతానికి పెంచిన నేపథ్యంలో, అదే ప్రయోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా వర్తింపజేస్తున్నట్లు ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. ఈ పెంపు 2026 జనవరి 1 నుంచే వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ డీఏ పెంపు వల్ల రాష్ట్ర ఖజానాపై ఏటా సుమారు రూ.1,230 కోట్ల అదనపు భారం పడనుందని అధికారులు అంచనా వేశారు. అయినప్పటికీ, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ప్రజా సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకమని ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ సందర్భంగా గుర్తు చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు, పెన్షనర్ల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయాల నుంచి ఇది కొంత ఉపశమనం కలిగిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. పెంచిన డీఏ, బకాయిల చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం త్వరలో పూర్తిస్థాయి ఉత్తర్వులు జారీ చేయనుంది.

# లాయర్ దుస్తుల్లో హైకోర్టుకు వచ్చిన మమతా బెనర్జీ

మొదటిపేజీ తరువాయి – అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలపై దాఖలైన కేసు విచారణ కోసం ఆమె నేడు కోర్టుకు హాజరయ్యారు. 15 ఏళ్ల టీఎంసీ పాలన ముగిసిన తర్వాత జరిగిన దాడులు, రాజకీయ ప్రతీకార చర్యలపై వస్తున్న ఆరోపణలను ఎదుర్కోవడానికి ఆమె స్వయంగా రంగంలోకి దిగడం విశేషం. సీనియర్ నేత కళ్యాణ్ బెనర్జీ కుమారుడు శీర్షణ్య బందోపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా ఈ విచారణ జరుగుతోంది. న్యాయం, రాజ్యాంగ విలువల కోసం తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని నిరూపించడానికి మమత ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. "ద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా, నిజం కోసం మమతా బెనర్జీ పోరాటం కొనసాగుతుంది" అని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈ సందర్భంగా పేర్కొంది. బీజేపీ అన్యాయాలకు వ్యతిరేకంగా ఆమె ఎప్పటికప్పుడు పోరాడుతున్నారని తెలిపింది.

**అడ్వొకేట్ దుస్తుల్లో కోర్టుకు వచ్చిన మమతా బెనర్జీ**

ఆమె న్యాయవాద హోదాపై ఆరా తీసిన బీసీఐ కోర్టులో లాయర్‌గా వాదనలు వినిపించిన మమతా బెనర్జీ ఆమె న్యాయవాద హోదాపై వివరణ కోరిన భారత బార్ కౌన్సిల్ రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని బెంగాల్ బార్ కౌన్సిల్‌కు ఆదేశం ఎన్నికల అనంతర హింసపై దాఖలైన పిల్‌లో వాదనలు ఇదొక అనవసర విషయమన్న ప్రస్తుత సీఎం సువేందు అధికారి పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ న్యాయవాద హోదాపై భారత బార్ కౌన్సిల్ (బీసీఐ) ఆరా తీస్తోంది. గురువారం ఆమె కలకత్తా హైకోర్టులో న్యాయవాది దుస్తులు ధరించి ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)లో వాదనలు వినిపించడమే ఇందుకు కారణమైంది. ఈ పరిణామంపై స్పందించిన బీసీఐ, ఆమె న్యాయవాద వృత్తికి సంబంధించిన పూర్తి వివరాలను రెండు రోజుల్లోగా అందించాలని పశ్చిమ బెంగాల్ బార్ కౌన్సిల్‌ను ఆదేశించింది. మమతా బెనర్జీ ఎన్‌రోల్‌మెంట్ నంబర్, నమోదు చేసుకున్న తేదీ, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు (2011–2026) ప్రాక్టీస్‌ను నిలిపివేశారా లేదా, తిరిగి ఎప్పుడు పునరుద్ధరించుకున్నారు వంటి వివరాలను సమర్పించాలని బీసీఐ తన లేఖలో కోరింది. రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగినందున, ఆమె న్యాయవాద వృత్తి హోదాపై వాస్తవాలను ధ్రువీకరించుకోవాల్సిన అవసరం ఉందని బీసీఐ స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని ఒరిజినల్ రికార్డులను భద్రపరచాలని, ఎలాంటి మార్పులు చేయరాదని కూడా ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో జరిగిన హింసపై దాఖలైన పిల్‌పై విచారణ సందర్భంగా మమత, ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. తన ట్రేడ్‌మార్క్ తెలుపు చీరపై నల్లకోటు ధరించి కోర్టుకు హాజరైన ఆమె, రాష్ట్రంలో మహిళలు, మైనారిటీలపై దాడులు ఆందోళనకర స్థాయికి చేరాయని ఆరోపించారు. తాను 1995లోనే న్యాయవాదిగా నమోదు చేసుకున్నానని, క్రమం తప్పకుండా సభ్యత్వాన్ని పునరుద్ధరించుకుంటున్నానని ఆమె ధర్మాసనానికి వివరించారు. ఈ పరిణామంపై ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారి స్పందిస్తూ.. "నాకు చాలా పనులున్నాయి. అనవసరమైన విషయాల గురించి ఆలోచించడానికి సమయం లేదు" అని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో, భవానీపూర్ నియోజకవర్గంలో సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ ఓటమి పాలైన విషయం తెలిసిందే.

నిజం దృష్టి తెలుగు న్యూస్ TG/TEL/25/A3731

శుక్రవారం 15- 05 - 2026

## టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్: బండి రమేష్



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, మే 14:** టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ గురువారం టి పి సి సి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నీ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల బొకే ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ గా పార్టీ తరపున సపోర్ట్ చేసినందుకు రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్పొరేషన్ ద్వారా కమ్మ కులం లోని పేదవారికి సహాయ సహకారాలు అందించి రాజకీయంగా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని మహేష్ కుమార్ ఈ సందర్భంగా రమేష్ కి సూచించారు.

## ఎమ్మెల్యే చేతుల మీదగా లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, మే 14:** కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ సర్కిల్ కు చెందిన కళ్యాణ లక్ష్మి ఒ షాదీ ముబారక్ 107 మంది లబ్ధి దారులకు ఎమ్మెల్యే కార్యాలయం లో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనాడు ఎంతో మానవతా దృక్పథంతో పేదింటి ఆడబిడ్డ పెళ్లయితే వారికి అండగా ఉండేందుకు కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకాన్ని దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రారంభించారని ..కాంగ్రెస్ పార్టీ అబద్ధాల హామీలు ఇచ్చి తులం బంగారం కూడా ఇస్తామని చెప్పి ఆడబిడ్డలను మోసం చేసిందని ..దేశంలో ఎక్కడా లేనటువంటి రైతుబంధు ,రైతు బీమా మిషన్ భగీరథ, వంటి గొప్ప కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శమే కాకుండా దేశానికి ఆదర్శమయ్యాయని.. తిరిగి మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ను ప్రజలు ఎన్నుకుంటారని ..ఆ రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు ..ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మహేశ్వరి శ్రీహరి, ఆవుల రవీందర్ రెడ్డి , పండాల సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటుకు స్థలం పరిశీలన





**నిజం న్యూస్ జూబ్లీహిల్స్ ప్రతినిధి, మే 14:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి అమీర్పేట మైత్రివనం చౌరస్తా వద్ద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి తెలుగు వారి ఆరాధ్య దైవం అన్న నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పడం జరిగింది ఇచ్చిన మాటని నిలబెట్టుకోవడంలో అన్న నందమూరి తారక రామారావు అడుగుజాడల్లో నడుస్తున్న రేవంతన్న గురువారం తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ టీపిసిసి ఉపాధ్యక్షులు కూకట్పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్, కలిసి మైత్రివనం వద్ద అన్న నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో అన్న నందమూరి తారక రామారావు అభిమానులు మండలపు సాయిబాబు చౌదరి పాల్గొనడం జరిగింది.

## కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా. దయాకర్ కు సన్మానం:- ఎర్ర యాకన్న



**నిజం న్యూస్ జూబ్లీహిల్స్ ప్రతినిధి, మే 14:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గా నూతనంగా నియామకం అందుకని బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ దయాకర్ ను యూనివర్సిటీ పరిధిలోని వివిధ బ్రాంచీలలో పనిచేస్తున్న కౌన్సిలర్స్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్స్ కృష్ణారెడ్డి, కిషోర్ కుమార్, రమాదేవి, తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగం సంఘం రాష్ట్ర మీడియా సెల్ అధ్యక్షులు ఎర్ర యాకన్న, సీనియర్ కౌన్సిలర్స్ యాదయ్య, డాక్టర్ తిరునగరి శ్రీనివాస్, డాక్టర్ ప్రమోద్ కుమార్, డాక్టర్ గుగులోతు శ్రీదేవి, డాక్టర్ ప్రశాంత్, రామచందర్, అనురాధ, రాజ్యలక్ష్మి, జగన్, పోతన, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

| States/UTs | Qualifying date of SIR | Preparation, Training & Printing | House to House visits by BLOs | Rationalization of Polling Stations | Publication of draft Electoral roll | Period for filing claims & objections | Notice Phase/ disposal of Claims & objection | Publication of Final Electoral Roll |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. Odisha 2. Mizoram 3. Sikkim 4. Manipur | 01.07.2026 | 20.05.2026 to 29.05.2026 | 30.05.2026 to 28.06.2026 | By 28.06.2026 | 05.07.2026 | 05.07.2026 to 04.08.2026 | 05.07.2026 to 02.09.2026 | 06.09.2026 |
| 5. DNH & DD | 01.07.2026 | 25.05.2026 to 03.06.2026 | 04.06.2026 to 03.07.2026 | By 03.07.2026 | 10.07.2026 | 10.07.2026 to 09.08.2026 | 10.07.2026 to 07.09.2026 | 11.09.2026 |
| 6. Uttarakhand | 01.07.2026 | 29.05.2026 to 07.06.2026 | 08.06.2026 to 07.07.2026 | By 07.07.2026 | 14.07.2026 | 14.07.2026 to 13.08.2026 | 10.07.2026 to 11.09.2026 | 15.09.2026 |
| 7. Andhra Pradesh 8. Arunachal Pradesh 9. Haryana 10. Chandigarh | 01.07.2026 | 05.06.2026 to 14.06.2026 | 15.06.2026 to 14.07.2026 | By 14.07.2026 | 21.07.2026 | 21.07.2026 to 20.08.2026 | 21.07.2026 to 18.09.2026 | 22.09.2026 |
| 11. Telangana 12. Punjab | 01.10.2026 | 15.06.2026 to 24.06.2026 | 25.06.2026 to 24.07.2026 | By 24.07.2026 | 31.07.2026 | 31.07.2026 to 30.08.2026 | 31.07.2026 to 28.09.2026 | 01.10.2026 |
| 13. Karnataka 14. Meghalaya 15. Maharashtra 16. Jharkhand 17. Delhi | 01.10.2026 | 20.06.2026 to 29.06.2026 | 30.06.2026 to 29.07.2026 | By 29.07.2026 | 05.08.2026 | 05.08.2026 to 04.09.2026 | 05.08.2026 to 03.10.2026 | 07.10.2026 |
| 18. Nagaland | 01.10.2026 | 05.08.2026 to 14.08.2026 | 16.08.2026 to 14.09.2026 | By 14.09.2026 | 20.09.2026 | 20.09.2026 to 20.10.2026 | 20.09.2026 to 18.11.2026 | 22.11.2026 |
| 19. Tripura | 01.10.2026 | 05.09.2026 to 14.09.2026 | 15.09.2026 to 14.10.2026 | By 14.10.2026 | 21.10.2026 | 21.10.2026 to 20.10.2026 | 21.10.2026 to 19.12.2026 | 23.12.2026 |

**నిజం న్యూస్ హైదరాబాద్, మే 14:** తెలంగాణలో జూన్ 25 నుంచి అక్టోబర్ 1 వరకు ఎస్ఐఆర్ జరగనుంది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కోసం ప్రత్యేకంగా బూత్ లెవల్ ఆఫీసర్ల నియామకం, శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. అనంతరం 2002 జాబితా ప్రకారం ఓటర్ల సవరణకు ఈసీ సిద్ధమైంది. అయితే, తమ ఓటును కోల్పోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ఓటర్‌దేనని ఈసీ స్పష్టం చేసింది. తెలంగాణలో జూన్ 15 నుంచి 24 వరకు శిక్షణ, జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటి సర్వే జరుగుతుంది. జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించి.. అదే రోజు నుంచి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అక్టోబర్ 1న తుది జాబితా ప్రకటించనున్నారు.

# మీసేవ ద్వారా మరో పోటీ పరీక్ష హాల్ టికెట్లు లభ్యత

### డీఈఈసెట్ హాల్ టికెట్లు మీ సేవ వాట్సాప్ ద్వారా అందుబాటులోకి

**నిజం న్యూస్ హైదరాబాద్, మే 14:** తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (జుూణ) విభాగం, డీఈఈసెట్ (ణఅజూశ్రీశీఝ అఅ జుశ్రీవవవత్ఝతీఎ జుఎఅష్ఠఅశీఅ జశీఎఎశీఅ జుత్తీఝఅఎవ ఎవర్) హాల్ టికెట్లను మీ సేవ వాట్సాప్/చాట్‌బాట్ లో అందుబాటులోకి తీసుకువచ్చింది.

రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు 15 మే 2026 ఉదయం 10:00 గంటల నుంచి వాట్సాప్ ద్వారా తమ హాల్ టికెట్లను వెంటనే పొందవచ్చు. డీఈఈసెట్ పరీక్ష ఈ నెల 21,22 తేదీల్లో జరగనుంది.

మీ సేవ వాట్సాప్ ద్వారా డీఈఈసెట్ హాల్ టికెట్ పొందే విధానం

1. అధికారిక మీ సేవ వాట్సాప్ నంబర్ 8096958096 ను "పీవమావజు ఎవశ్రీఖఅస్త్రుఅు" పేరుతో సేవ్ చేసుకోవాలి.
2. వాట్సాప్ ఓపెన్ చేసి "ఎఱ" అని మెసేజ్ పంపాలి.
3. "ఐజుజుజజు ఝశ్రీశ్రీ ఎఅఎఎవ్" అని టైప్ చేయాలి.
4. మెనూలో కనిపించే "రాజూవఅ ఎావతీజఅఎవ" ఎంపికపై క్లిక్ చేయాలి.
5. అవసరమైన వివరాలు నమోదు చేయాలి:
   - **Payment ID**
   - **Application Number**
   - **Mobile Number**
   - **Date of Birth (DOB)**
6. వివరాలు సమర్పించిన వెంటనే డీఈఈసెట్ హాల్ టికెట్ వాట్సాప్‌లో అందుతుంది.

ఈ సేవ ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు పరీక్షలకు సంబంధించిన సేవలు వేగంగా, పారదర్శకంగా అందుబాటులోకి వస్తాయి. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకంగా, సులభమైన డిజిటల్ సేవలను అందించాలనే లక్ష్యంతో, ఐటీ ఒ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో మీ సేవ ద్వారా పౌర సేవలను మరింతగా విస్తరిస్తూ ముందుకు సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన డిజిటల్ సేవల వేదిక అయిన మీ సేవ, 18 నవంబర్ 2025న ప్రారంభించిన మీ సేవ వాట్సాప్/చాట్‌బాట్ సేవల ద్వారా ప్రజలకు మరింత సులభంగా ప్రభుత్వ సేవలను అందిస్తోంది.

ప్రారంభం నుంచి విశేష ఆదరణ

18 నవంబర్ 2025న ప్రారంభమైన మీ సేవ వాట్సాప్/చాట్‌బాట్ సేవలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే ఈ వేదిక తెలంగాణలో అత్యంత వేగంగా ప్రజాదరణ పొందిన డిజిటల్ పౌర సేవా వేదికలలో ఒకటిగా నిలిచింది.

**అత్యధికంగా వినియోగిస్తున్న సేవలు:**

జనన ధృవపత్రం
ఆదాయ ధృవపత్రం
పోలీస్ చలాన్ సేవలు
విద్యుత్ బిల్లు సేవలు
బీఐఈ ఫలితాల సేవలు

వాట్సాప్ ఆధారిత ప్రభుత్వ సేవలపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం, మీ సేవ వేదికల ద్వారా మరిన్ని డిజిటల్ సేవలను విస్తరించేందుకు నిరంతర ప్రయత్నం చేస్తోంది.

## సెంట్రింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే కృష్ణారావు కి వినతి పత్రం ఇచ్చిన :సెంట్రింగ్ కార్మికులు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, మే 14:** గురువారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంప్ కార్యాలయానికి సెంట్రింగ్ కార్మికులు వారి సమస్యలను వినతిపత్రం ద్వారా అందించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ..ఇదే సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని కోరుతూ ఏ భవన నిర్మాణ పనుల్లో అయినా సెంట్రింగ్ కార్మికులు ప్రధాన పాత్ర పోషిస్తారని.. అటువంటి వారికి జీవిత బీమా కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని.. ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని.. 10 లక్షల బీమా ప్రభుత్వం వారి కల్పించాలని అలాగే.. సెంట్రింగ్ మెటీరియల్ దొంగిలించిన కొనే వారిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని.. రైట్స్ లో ఎటువంటి చట్టం ఉండో అదేవిధంగా సెంట్రింగ్ వారి సామాన్ల విషయంలో చర్యలు తీసుకోవాలని కోరారు.. మానవతా దృక్పథంతో జీహెచ్ఎంసీ వారు కూడా వీరి పట్ల మెలగాలని ..ఎవరైనా భవనాన్ని కూల్చేటప్పుడు వీరు కష్టార్జితం కూడా ధ్వంసమవుతుందని ..అది గుర్తించి వీరికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉండాలని వీరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హామీ ఇచ్చారు.

## హరిత తెలంగాణ నే లక్ష్యంగా పార్కులకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్న తెలంగాణ ప్రభుత్వం: జగదీశ్వర్ గౌడ్






**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, మే 14:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రివర్యులు ఏ రేవంత్ రెడ్డి, మంత్రుల ప్రజల ఆరోగ్యం,పర్యావరణ పరిరక్షణ నగరాల సౌందర్యవృద్ధిని దృష్టిలో పెట్టుకుని పార్కుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. గురువారం హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో సీఎంసీ కాలనీ అసోసియేషన్ సహకారంతో నూతనంగా నిర్మించి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్,వాకింగ్ ట్రాక్ చిన్నారుల కోసం పార్క్ ను శేరిలింగంపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు అరికపూడి గాంధీ,నియోజకవర్గం నాయకులు,స్థానిక ప్రజలతో కలిసి ప్రారంభించారు శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హరిత తెలంగాణ లక్ష్య సాధనలో ఈ చర్యలు రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను చూపిస్తున్నాయని,ఆధునిక వసతులతో కూడిన పార్కులు ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించడమే కాకుండా పిల్లలు,యువత,వృద్ధులకు వినోద కేంద్రాలుగా మారుతున్నాయని అన్నారు.. "పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పరిశుభ్రమైన,హరిత వాతావరణాన్ని అందించేందుకు కట్టుబడి ఉందని,పట్టణాలు మరియు గ్రామాల్లో ఆధునిక సదుపాయాలతో పార్కులను అభివృద్ధి చేస్తూ,వాకింగ్ ట్రాక్‌లు,పిల్లల ఆట స్థలాలు,ఓపెన్ జిమ్‌లు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తోందని,పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్యం,జీవన నాణ్యత మెరుగుపడేలా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు హరిత తెలంగాణ సాధనకు దోహదపడుతున్నాయని అన్నారు.. ఈ కార్యక్రమంలో నాయకులు బల్లింగ్ యాదగిరి గౌడ్,కనకమామిడి నరేందర్ గౌడ్,బల్లింగ్ గౌతమ్ గౌడ్,శేఖర్ ముదిరాజ్,మన్నేపల్లి సాంబశివ రావు,సుబ్బ రావు,సంజు,పద్మ రావు,విజయ్ భాస్కర్ రెడ్డి,ఆల్విన్ కాలనీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి,రాజిరెడ్డి రెడ్డి,మల్లేష్,నర్సిములు,లక్ష్మ రెడ్డి,పెద్ది రెడ్డి,సాంబశివ రెడ్డి,శ్రీనివాస్,వేణు గోపాల్,రవీంద్ర రెడ్డి,కిషన్ రావు,సుదర్శన్ రాజు,గోపాల్,సదానంద్ రెడ్డి,వెంకటేశ్వర రావు,శివ శంకర్ రెడ్డి,రమణ రెడ్డి,బాల్ రెడ్డి,వెంకట్ యాదవ్,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ ప్రజా ప్రభుత్వం బ్రాహ్మణుల సంక్షేమ కార్యక్రమాలకు అభివృద్ధికి తోడుగా ఉంటుంది






పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.

**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, మే 14:** సీఎం రేవంత్ రెడ్డి ధర్మాన్ని కాపాడంలో, బ్రాహ్మణ సమాజ అభ్యున్నతికి ఎల్లప్పుడు కృషి చేస్తారు – పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.తెలంగాణ రాష్ట్ర ఐటీ,ఈ పరిశ్రమలు ఒ వాణిజ్యం , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ గా బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ గా పొన్నాడ సుబ్రమణ్య ప్రసాద్ పదవి బాధ్యతల స్వీకార మహోత్సవం వసంత్ విహార్ ఫంక్షన్ హాల్, నాగోల్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావు, స్టేట్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, మాజీ కేంద్రమంత్రివర్యులు సముద్రాల వేణుగోపాల చారి తో హాజరై వారికి శాలువాతో సత్కరించి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసిన పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. అనంతరం బ్రాహ్మణ సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను సమాజంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా సమన్వయంతో పనిచేయాలని సత్యం శ్రీరంగం అన్నారు. శ్రీధర్ బాబు సహకారంతో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కు సహకరించి ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులను తీసుకువచ్చే బాధ్యత తీసుకోవాలని కోరారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం మరింత సమర్థవంతంగా పనిచేసి సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బ్రాహ్మణ సంఘాలు, ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
శుక్రవారం 15- 05 - 2026

# ప్రమాద ఘంటికలు




**నిజం న్యూస్ హైదరాబాద్, మే 14:** దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కొంత కాలంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు మన దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభం దిశగా పయనిస్తున్న తీరును కళ్లకు కడతాయి. రోజుల తరబడి స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి విలువ పతనం కొనసాగడం, ద్రవ్యోల్బణం అడ్డు అదుపులేకుండా పెరగడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల, ఇవన్నీ కలిపి దేశ ఆర్థిక స్థితిపై ఆందోళనకర దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన పొదుపు సూచనలు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేశాయి. మంగళవారం నాడు స్టాక్‌మార్కెట్ సెన్సెక్స్ ఒక్కరోజులోనే 1,456 పాయింట్లు కుప్పకూలి, 11 లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరి కావడం, విదేశీ పెట్టుబడుదారులు పెద్ద ఎత్తున నిధులు వెనక్కి తీసుకోవడం ఈ పరిణామాల కొనసాగింపే. ఇది మదుపరులలో నెలకొన్న విశ్వాస సంక్షోభాన్ని బట్టబయలు చేసింది. అదే సమయంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న తీరు మరింత ఆందోళనకరం. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి చేరి 13 నెలల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆహార ద్రవ్యోల్బణం 4.2 శాతానికి పెరగడం సామాన్య కుటుంబాలపై తీవ్రమైన భారం మోపుతోంది. పప్పుధాన్యాలు, కూరగాయలు, వంటనూనెలు, పాల ఉత్పత్తుల ధరలు వరుసగా పెరుగుతుండగా, ప్రజల ఆదాయం మాత్రం పెరగడం లేదు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరుగుతుండటం, అసంఘటిత రంగంలో ఉపాధి క్షీణించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల నిధులను తెగ్గోయడం వంటి చర్యలు ఇప్పటికే ప్రజల కొనుగోలు శక్తిని దారుణంగా దెబ్బతీశాయి. ఈ ధరాఘాతం నుండి ప్రజలకు ఊరటనిచ్చే చర్యలు తీసుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం మరింతగా భారాలు మోపేందుకు కసరత్తు చేస్తుండటం దారుణం! అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరుగుతుండటాన్ని సాకుగా చూపుతూ పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచడానికి ఇప్పటికే సిద్ధమైంది. 'పెట్రో ధరలు పెరగవని నేను చెప్పలేను అంటూ సాక్షాత్తు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇదే మాదిరి కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చంటూ రిజర్వు బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా చేసిన వ్యాఖ్యలతో దేశంలో పెట్రో మోత తప్పదని తేలిపోయింది. అయితే, ఏ స్థాయిలో ధరలు పెరుగుతాయి, ఎప్పటి నుండి పెరుగుతాయి అన్న అంశంపైనే స్పష్టత రావాల్సిఉంది. నాలుగేళ్లుగా పెట్రో ధరలు పెరగలేదంటూ తాజాగా చేయబోయే పెంపునకు సమర్ధనగా కేంద్రం చేస్తున్న వాదనలు ఏ మాత్రం సమర్ధనీయం కాదు. ప్రత్యక్షంగా పెంచకపోయినప్పటికీ, రకరకాల విన్యాసాలతో ప్రజల మూలుగులను ఇప్పటికే పీల్చి పిప్పిచేసిన సంగతిని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం పెరిగి, దాని ప్రభావం అన్ని వస్తువులపై పడటం ఖాయం. బంగారం కొనుగోలును ఏడాదిపాటు నిలిపివేయాలని ప్రధాని సూచించగా, కేంద్ర ప్రభుత్వం తాజాగా బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను 6 నుండి 15 శాతానికి పెంచడం కూడా ప్రజలపై భారాలు మోపే చర్యే! 2026 సంవత్సరానికి భారత జిడిపి వృద్ధి అంచనాను మూడీస్ 6.5 శాతం నుండి 6.3 శాతానికి తగ్గించడం యాదృచ్ఛికం కాదు. దేశీయ వినియోగం మందగించడం, తయారీ రంగం ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడం, చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఒత్తిడిలో ఉండటం, రైతాంగ ఆదాయం స్థిరంగా లేకపోవడం వంటి అంశాలు దేశ ఆర్థిక వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. అయినా, సంపన్నులకు రాయితీలు ఇచ్చి, సామాన్యులపై భారాలు మోపే విధానాలు కొనసాగిస్తూ నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్–మతతత్వ రాజకీయాలను కొనసాగిస్తోంది. ఇప్పటికైనా, ప్రభుత్వం ప్రజాకేంద్రిత ఆర్థిక విధానాలకు మరలాలి. ధరల నియంత్రణ చర్యలు, ఉపాధి హామీ, వ్యవసాయ, చిన్న పరిశ్రమల రక్షణపై దృష్టి పెట్టాలి. లేని పక్షంలో దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవడం ఖాయం.

# సంజయ్ రెడ్డి: ఎవరు జర్నలిస్ట్?

ఎవరికి అక్రిడిటేషన్?




**నిజం న్యూస్ హైదరాబాద్, మే 14:** ఇటీవల జర్నలిస్టులంటే ఎవరు? అనే సందేహాలు నలువైపుల నుంచి వస్తున్నాయి. జర్నలిస్టులని ఓ వైపు ప్రజలు మరో వైపు ప్రభుత్వం గుర్తించాలంటే ప్రభుత్వం ఇచ్చే ఉచిత బస్సు ప్రయాణ రాయితీ కార్డు అక్రిడిటేషన్ అనేదే ప్రామాణికమని కొందరంటుంటే లేదు.. లేదు అక్రిడిటేషన్‌కి జర్నలిస్టులకి సంబంధం లేదని మరికొందరంటున్నారు. ఇలా రెండు భిన్న వాదనల నడుమ పాత్రికేయులు అంటే ఎవరు? వారి విధివిధానాలంటే ఏంటనే ప్రశ్న చాలామంది నుంచి వ్యక్తమవుతోంది. ఈ ప్రశ్నలకు సమాధానం వెతుకుదాం... జర్నలిజాన్ని ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా పిలుస్తారు. శాసన,కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల తరువాత ఫోర్త్ ఎస్టేట్‌గా పాత్రికేయానిదే స్థానం. ప్రజాస్వామ్యానికి కావలిగా జర్నలిజం అత్యున్నత స్థానంలో కీర్తించబడుతోంది. ఒక్క సిరా చుక్క లక్షల మెదళ్లలో కదలిక తేగలుగుతుందని, పత్రిక ఒకటుంటే పదివేల సైన్యం ఉన్నట్లేనని ఇలా అనేక వర్ణనలతో ఎందరో మహానుభావులు పాత్రికేయం గొప్పతనాన్ని వర్ణించారు. అయితే ఇంతటి గొప్ప వ్యవస్థలో గడిచిన పది సంవత్సరాలుగా అనేక లోపాలు, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పాత్రికేయ వృత్తిపై అనేక రకాల ఆరోపణలు విన్పిస్తున్నాయి. అసల జర్నలిజం ఉనికే ప్రమాదపుటంచుల్లోకి నెట్టివేయబడిందని చెప్పవచ్చు.ఒకప్పుడు పత్రికలు వార్తల మీద అమ్ముడుపోయేవి.. నేడు వార్తల మీద కాకుండా తమ హిడెన్ అజెండా మీదనే మీడియా సంస్థలు నడుస్తున్నాయి.ఈ పరిస్థితుల్లో జర్నలిస్టుల మీద అనేక సందేహాలు నెలకొన్నాయి. దీంతో ఎవరు జర్నలిస్టు? ఎవరు జర్నలిస్టు కాదు అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అక్రిడిటేషన్ ఉంటేనే జర్నలిస్టు అని అది లేకుంటే జర్నలిస్టు కాదనే భావన ప్రభుత్వమే పరోక్షంగా పెంచి పోషించింది. దీనికి కొందరు దళారులు తోడై ఈ విషయానికి విపరీత ప్రచారం కల్పించారు. ఈ ప్రచారమే నిజమనుకుని ఉన్నతాధికారులు, నేతలు అక్రిడిటేషన్ ఉంటేనే జర్నలిస్టులని మిగతా వారు నఖీలీలంటూ పాత్రికేయులపై వివక్షత చూపుతున్నారు. రాజ్యంగం తెలిసిన ఐఎఎస్, ఐపిఎస్, గ్రూప్ వన్ అధికారులతోపాటు వివిధ ఉన్నతస్థాయి అధికారులు, రాజకీయ నేతలు కూడా అక్రిడిటేషన్ ఉంటేనే జర్నలిస్టనే వివక్ష కొనసాగిస్తుండటం ఆశ్చర్యం కల్గించే అంశమే. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ఫోర్త్ పిల్లర్ పాత్ర అంటే ఏంటో వారికి తెలియదా లేక ప్రభుత్వం, కొందరు దళారులు కల్పించిన ప్రచారానికి భయపడి పాత్రికేయులపై అక్రిడిటేషన్ అనే వివక్ష కొనసాగిస్తున్నారా? అనేది తేలాల్సి ఉన్నది. అక్రిడిటేషన్ అనేది సర్వ రోగ నివారిణి ఎంతమాత్రం కాదు..జర్నలిజాన్ని గుర్తించే పట్టా అంతకన్నా కానే కాదు. అది కేవలం ప్రభుత్వం ఇచ్చే ఉచిత ప్రయాణ రాయితీ కార్డు మాత్రమే. ఈ కార్డుని ఆధారంగా చేసుకుని జర్నలిస్టులని గుర్తిస్తామంటే అంతకన్నా తెలివి తక్కువతనం మరొకటి లేదు. అలా ఎవరైనా ప్రయత్నించారంటే వారికి జర్నలిజంపై, ప్రజాస్వామ్యంపై, భారత రాజ్యాంగంపై అవగాహన లేదనే చెప్పవచ్చు.ఓ జర్నలిస్టు ఔనో కాదో తేల్చాల్చింది అతనికి ఉన్న జ్ఞానం..సమాజం హితంపై అతనికున్న ఆలోచనే. ప్రజాహితమే లక్ష్యంగా పనిచేస్తూ ...నీతిని వీడకుండా...నిజాన్ని కప్పిపుచ్చకుండా...ప్రజాస్వామ్య వారధులుగా ఉండే వారందరూ జర్నలిస్టులే. ఒక జర్నలిస్టుకి గుర్తింపు ఆ మీడియా సంస్థ ఇచ్చే గుర్తింపు కార్డే అత్యున్నత ప్రామాణికం. ప్రభుత్వ రాయితీలు, అక్రిడిటేషన్ వద్దనుకుని నిజాయితీగా ప్రజల కోసం కలాన్ని పట్టిన ఎందరో నిఖార్సయిన పాత్రికేయులు నేడూ ఉన్నారు. మరి అలాంటివారందూ జర్నలిస్టులు కాదని, అలాంటివారికి ప్రెస్ క్లబ్బుల్లో సభ్యత్వం ఇవ్వం..అలాంటివారిని ప్రభుత్వ సమావేశాలకు వార్తల సేకరణ కోసం రానీయమని ఎవరైనా చెబుతున్నారంటే వారు ఖచ్చితంగా దళార్లే అయి ఉంటారు.ఇక అక్రిడిటేషన్ అనేది ఒకప్పుడు ఉచిత ప్రయాణ రాయితీ కార్డుగా ఉన్నప్పుడు అక్రిడిటేషన్ అర్హులైన జర్నలిస్టుందరి జేబులో ఉండేవి. అయితే రాను రాను తమ స్వార్థ ప్రయోజనాల కోసం అక్రిడిటేషన్ ఉంటే డబుల్ బెడ్ రూం ఇండ్లు వస్తాయని, కార్పోరేట్ వైద్యం, ప్రెస్ క్లబ్బులో సభ్యత్వాలు, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య వస్తుందని అనేక ఎన్నికల హామీలు..భ్రమలు వెరసి నేడు అక్రిడిటేషన్ అంగట్లో సరకులా మారింది. జర్నలిజానికి సంబంధంలేని వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు, అసాంఘీక శక్తుల జేబుల్లో అక్రిడేషన్లు చేరిపోతున్నాయి. ఒక్క అక్రిడిటేషన్ నేడు రూ.30 వేల నుంచి రూ.60 వేల దాకా మార్కెట్లో ధర పలుకుతోందనే గుసగుసలు విన్పిస్తున్నాయి. అంటే మనం రూ.30 నుంచి 60 వేల దాకా ఇచ్చుకోగలిగితే ఒక్క రోజులోనే జర్నలిస్టుగా మన జేబులో అక్రిడిటేషన్ ఉంటుంది. అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టుగా మారిపోయి ఒక్కరోజులోనే ప్రభుత్వం ఇచ్చే అన్ని రాయితీలకు అర్హత సాధించొచ్చన్నమాట. జర్నలిజం కోర్సులు చేయాల్సిన పనిలేదు..ప్రజా హితం అంతకన్నా అవసరం లేనేలేదు...అక్షరం రాయరాకున్నా పర్వాలేదు..జస్ట్ రూ. 30 వేల నుంచి రూ.60 వేలు మన దగ్గర ఉంటే చాలు. సీనియర్ జర్నలిస్ట్, అక్రిడేటెట్ జర్నలిస్ట్ అనే ముద్ర తగిలించుకోవచ్చు.అన్నీ కుదిరితే డబుల్ బెడ్ రూం ఇండ్ల లిస్టుల జాబితాలో చోటు దక్కించుకోవచ్చు. ఇదంతా నేడు జరుగుతున్న వాస్తవ పరిస్థితి. దీనికంతటికి కారణం ప్రభుత్వ ఉదాసీనతేనని చెప్పక తప్పదు. సమాచార శాఖలో ఉన్న నిబంధనలు కాలఋగుణంగా మార్చకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఇప్పుడు ప్రపంచమంతా డిజిటల్ మయం అయింది. నగదు రహిత ప్రపంచంగా గొప్పగా చెప్పుకుంటూ పత్రికా రంగంలో మాత్రం ప్రింటింగ్, కాపీలు అంటూ లెక్కలు వేసి గ్రేడింగ్‌లు, రేటింగ్‌లు, అక్రిడేషన్లు అంటూ పాత్రికేయ వృత్తిని మకిలిపట్టిస్తున్నారు. మరో విషయం ఏంటంటే నేడు మారుతున్న కాలానికనుగుణంగా సమాచార శాఖలోని జీవోలను మార్చాలనే వాదం బలంగా విన్పిస్తోంది. కార్పోరేట్ శక్తులు, వ్యాపారులు, రాజకీయ పార్టీల చేతుల్లో నడుస్తున్న మీడియాల చేతిలోనే నేడు మూడొంతులు అక్రిడేషన్లు ఉన్నాయి. మరి అలాంటి మీడియాల్లో వచ్చే వార్తల్లో నిజాలుంటున్నాయా? ఒక పత్రికది ఒకరంగు..మరో పత్రికది మరో రంగు. ఒక పత్రికలో ఒక పార్టీ వార్త..మరో మీడియాలో మరో పార్టీ భజన. మరి నిజాలు చెప్పకుండా ఓ వైపు పక్షపాతంగా ఉంటున్న ఇలాంటి మీడియాలన్నింటికి అన్ని రాయితీలు ఇస్తూ, అక్రిడేషన్లు ఇస్తూ గుర్తింపు ఇచ్చినప్పుడు..నిజాన్ని నిర్భయంగా..ప్రజాహితమే లక్ష్యంగా పనిచేస్తూ అక్షరాలనే నమ్ముకున్న చిన్న మీడియాలపై వివక్ష ఎందుకు? అందులో పనిచేసే జర్నలిస్టులని జర్నలిస్టులు కాదని అనడం ఎందుకు? ఈ పరిస్థితి దారుణమైనది కాదా? ఇలా ఎన్నో ప్రశ్నలకు సమాచార శాఖ లేదా ప్రభుత్వం వద్ద సమాధానాలు ఉండవు. నిబంధనల ప్రకారం అక్రిడేషన్లు ఇవ్వడంలో తప్పులేదు. అయితే సర్వ రోగ నివారిణిలా అన్ని పనులకు అక్రిడిటేషన్ అనేదాన్ని ప్రమాణికంగా తీసుకోవడమే సరియైన విధానం కాదు. ఈ విషయాన్ని ఏ జర్నలిస్టూ ఒప్పుకోరు. ఎందుకంటే జర్నలిస్టులకి అక్రిడిటేషన్ అనేది ఎట్టి పరిస్థితుల్లో గుర్తింపు పత్రం కాదు. అది కేవలం ఉచిత బస్సు ప్రయాణ రాయితీ కార్డు మాత్రమేని మరో మారు చెప్పాల్సి వస్తోంది. ఈ విషయాన్ని అన్ని వర్గాలవారు గుర్తిస్తే ఎవరు జర్నలిస్టు? ఎవరు జర్నలిస్టు కాదు? అనే ప్రశ్నకు సమాధానం తప్పక దొరుకుతుంది.ముఖ్యంగా సర్కార్ ఈ విషయాన్ని గుర్తెరగాల్సిన అవసరం ఉంది

వ్యవస్థాపికలు
సంజయ్ రెడ్డి
జే ఏ వై జర్నలిస్టులఅసోసియేషన్.
జూకంటి లక్ష్మి శ్రీకాకుళం జిల్లా
జే ఏ వై అసోసియేషన్
శ్రీకాకుళం జిల్లా ప్రెసిడెంట్ మే జూకంటి లక్ష్మి

# నీట్ పై కదులుతున్న డొంక

**నిజం న్యూస్ హైదరాబాద్, మే 14:** రూ.30 లక్ష?లకు ప్రశ్నాపత్రం కొనుగోలు! గురుగ్రామ్ వైద్యుడి నుంచి పొందిన రాజస్తాన్ సోదరులు పరీక్ష కు వారం ముందే ఈ వ్యవహారం సికార్ కేంద్రంగా దేశవ్యాప్తంగా లీక్ దర్యాప్తులో వెలుగులోకి కీలక విషయాలు ఇప్పటికి ఐదుగురి అరెస్ట్ న్యూఢిల్లీ దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్ యూజీ–2026 ప్రశ్నాపత్రం లీక్ కేసులో దర్యాప్తు ముమ్మరమవుతోంది. రాజస్తాన్‌లోని జామ్‌వా రామ్‌గఢ్‌కు చెందిన మంగీలాల్, దినేష్ బివాల్ అనే ఇద్దరు సోదరులు పరీక్షకు వారం ముందే హర్యానాలోని గురుగ్రామ్‌కు చెందిన ఓ డాక్టర్ నుంచి రూ.30 లక్షలకు ప్రశ్నాపత్రాన్ని కొనుగోలు చేసినట్టు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. అనంతరం ఆ ప్రశ్నాపత్రాన్ని వారు పలువురు అభ్యర్థులకు విక్రయించినట్టు ఆరోపణలు ఉన్నాయి.




### ప్రశ్నాపత్రాన్ని తన కుమారుడినకి అందించిన నిందితుడు

దర్యాప్తులో తేలిన వివరాల ప్రకారం.. రాజస్తాన్‌కు చెందిన ఇద్దరు సోదరుల్లో ఒకరు గురుగ్రామ్ వైద్యుడి నుంచి కొనుగోలు చేసిన ఆ ప్రశ్నాపత్రాన్ని నీట్‌కు సిద్ధమవుతున్న తమ కుమారుడికి అందించారు. ఆ తర్వాత వారు ఏప్రిల్ 29న సికార్‌లో పలువురికి విక్రయించినట్టు సమాచారం. దీంతో రాజస్తాన్‌లోని సికార్ ఈ ఏడాది పేపర్ లీక్ వ్యవహారానికి కేంద్రబిందువుగా మారింది. జామ్‌వా రామ్‌గఢ్ నుంచి ప్రశ్నాపత్రం ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఏజెంట్ రాకేశ్ కుమార్ మండావారియాకు చేరగా, ఆయన దానిని మరొకరికి విక్రయించాడు. కోచింగ్ సెంటర్ల పరిసరాల్లో కార్యకలాపాలు నిర్వహించే రాకేశ్.. ఆ పేపర్‌ను రూ.30 వేలకు కేరళలో ఎంబీబీఎస్ చదువుతున్న సికార్‌కు చెందిన ఓ విద్యార్థికి అమ్మినట్టు ఆరోపణలు ఉన్నాయి.

### ఓ హాస్టల్ ఓనర్‌కు చేరిన ప్రశ్నాపత్రం

అటు తర్వాత పరీక్షకు ఒక రోజు ముందు సదరు విద్యార్థి సికార్‌లో పీజీ హాస్టల్ నడుపుతున్న తన తండ్రికి వాట్సాప్ ద్వారా ప్రశ్నాపత్రం పంపాడు. సికార్‌లోని ఒక స్నేహితుడి నుంచి తనకు ఈ ప్రశ్నాపత్రం అందిందనీ, హాస్టల్‌లో ఉన్న బాలికల (విద్యార్థినులు)కు దీనిని ఇవ్వాలని ఆ విద్యార్థి తన తండ్రికి చెప్పాడు. రేపు జరిగే పరీక్ష?లో ఇవే ప్రశ్నలు వస్తాయని కూడా చెప్పినట్టు దర్యాప్తులో తేలింది. అనంతరం ఆ ప్రశ్నాపత్రం హాస్టల్‌లో ఉన్న పలువురికి చేరినట్టు అధికారులు చెబుతున్నారు. కాగా ఈ కేసులో గురుగ్రామ్ డాక్టర్ కీలక పాత్రధారిగా ఉన్నాడు. ఈ ప్రశ్నాపత్రం మొదట మహారాష్ట్రలోని నాసిక్ ప్రింటింగ్ ప్రెస్ నుంచి చైన్ నెట్‌వర్క్ ద్వారా గురుగ్రామ్ వైద్యుడి వద్దకు చేరిందని, అక్కడి నుంచి రాజస్తాన్ సోదరులు ఇద్దరు కొనుగోలు చేసి, ఇతరులకు విక్రయించినట్టు రాజస్తాన్ పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఓజీ) అనుమానిస్తోంది. అయితే గురుగ్రామ్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్షుడు డా.రాజేశ్ కతారియా మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై గురుగ్రామ్ వైద్యుడి గురించి తమను ఇప్పటివరకు ఎలాంటి దర్యాప్తు సంస్థ కూడా సంప్రదించలేదని తెలిపారు.

### ప్రశ్నాపత్రం లీకేజీపై నెలరోజుల ముందే సమాచారం

దర్యాప్తులో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. అరెస్టయిన సోదరులకు నెల రోజుల ముందే పేపర్ లీక్ అవుతుందని సమాచారం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీరిలో దినేశ్‌కు ఒక రాజకీయ పార్టీతో సంబంధం ఉన్నట్టు కూడా సమాచారం. వీరి కుటుంబానికి చెందిన నలుగురు విద్యార్థులు నీట్‌లో అర్హత సాధించినట్టు కూడా దర్యాప్తు వర్గాలు చెప్తుండటం గమనార్హం.

### సికార్‌లో వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపులతో ప్రశ్నాపత్రం షేరింగ్

ఇక ఈ ప్రశ్నాపత్రం లీకైన సికార్‌లో విద్యార్థులు, కోచింగ్ నిర్వాహకులు కలిసి వాట్సాప్, టెలిగ్రాఖమ్ గ్రూపు ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా ప్రశ్నాపత్రాన్ని పంచుకున్నట్టు తెలుస్తోంది. నాసిక్ ప్రింటింగ్ ప్రెస్ నుంచి హర్యానా, జామ్‌వా రామ్‌గఢ్ మార్గంగా సికార్‌కు చేరిన ప్రశ్నాపత్రం , ఆ తర్వాత అక్కడి నుంచి జమ్మూకాశ్మీర్, బీహార్, కేరళ, ఉత్తరాఖండ్‌లకు వ్యాపించినట్టు అధికారులు అనుమానిస్తున్నారు.

### 700 మందికి పంపిణీ చేసిన రాకేశ్ కుమార్

కాగా డెహ్రాడూన్‌లో అరెస్టయిన రాకేశ్ కుమార్ మండావారియా దాదాపు 700 మంది విద్యార్థులకు ప్రశ్నాపత్రాన్ని పంపిణీ చేసినట్టు సమాచారం. అనంతరం ఆ పీడీఎఫ్ విస్తృతంగా చక్కర్లు కొట్టడంతో పాటు ప్రింటెడ్ కాపీల రూపంలో కూడా విక్రయించబడినట్టు సమాచారం. హర్యానాలో పేపర్ విక్రయించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న యశ్ యాదవ్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో కూడా ఈ కేసుకు సంబంధించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో నీట్ పరీక్ష లీక్ వ్యవహారంలో ఇప్పటికీ ఐదుగురు అరెస్టయ్యారు.ఈనెల 3న నిర్వహించిన నీట్ యూజీ 2026 పరీక్షను కేంద్ర ప్రభుత్వం అనుమతితో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మంగళవారం రద్దు చేసిన విషయం విదితమే. అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కేంద్రం ఆదేశించడంతో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కొత్త పరీక్ష తేదీలను 7 నుంచి 10 రోజుల్లో ప్రకటిస్తామని ఎన్‌టీఏ ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో సీబీఐ క్రిమినల్ కుట్ర, మోసం, నమ్మకద్రోహం, సాక్ష్యాల ధ్వంసం తదితర అభియోగాలతో కేసు నమోదు చేసింది. అలాగే అవినీతి నిరోధక చట్టం, పబ్లిక్ ఎగ్జామినేషన్ ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్ యాక్ట్–2024 కింద కూడా కేసులు నమోదు చేసింది.రాజస్తాన్ పోలీసుల ఎస్ఓజీ స్వాధీనం చేసుకున్న "కెమిస్ట్రీ గెస్ పేపర్"లో ఉన్న 410 ప్రశ్నల్లో దాదాపు 120 ప్రశ్నలు అసలు పరీక్షలో వచ్చినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని అధికారులు తెలిపారు

# అర్హులకు డబుల్ బెడ్ రోమ్ లు కేటాయిస్తాం




బెల్లంపల్లి **మే 14 నిజం న్యూస్:** బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పద్మశాలి ఫంక్షన్ హాల్ లో బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 34 వార్డుల నుండి అర్హులైన నిరుపేదలకు లక్కీ డ్రా నిర్వహించిన డబుల్ బెడ్ రూమ్ ల కేటాయింపు కార్యక్రమంలో పాల్గొన్న బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ...ఈ లక్కీ డ్రా ద్వారా లబ్ది పొందిన వారికీ ముందుగా శుభాకాంక్షలు తెలిరాజేశారు.ఈరోజు అర్హులుగా ఉండి డబుల్ బెడ్ రూమ్ రాని వారు ఎలాంటి నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అర్హులైన ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ళు పథకం ద్వారా నిరుపేదలకు ఇండ్లు ఇస్తున్నారన్నారు.కాబట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ళు కేటాయించడం జరుగుతుందన్నారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు తహసిల్దార్,పోలీస్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది,రెవెన్యూ సిబ్బంది లబ్దిదారుల ఆధ్వర్యంలో పూర్తి పారదర్శకంగా జరుగిందన్నారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కొంతమంది కావాల్సుకొని రాజకీయ లబ్ధి కోసం గొడవ సృష్టించేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు.రాజకీయ లబ్ధి కొరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్దిదారులను ఇబ్బంది పెట్టే విధంగా బీఆర్ఎస్ నాయకులు,కౌన్సిలర్లు ప్రయత్నించిన తీరు సిగ్గుచేటు అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇడ్ల కేటాయింపు విషయంలో ఎవరైనా ఇప్పటికే దళారులను నమ్మి డబ్బులు ఇచ్చి ఉంటే వెంటనే వారి వద్ద నుంచి మీ డబ్బులు వసూలు చేసుకొండని వారు సూసించారు.ఎవరైనా దళారులు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడితే మా దృష్టికి తీసుకువస్తే వారికీ సహాయం అందిస్తామని పేర్కొన్నారు.



# ఓటర్ వివరాలు మ్యాపింగ్ చేసుకోవాలి

**తాసిల్దార్ సత్యనారాయణ..**

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మనోహర్ **మే 14 నిజం న్యూస్:** ఆర్మూర్, ఫ్రీ ఎస్ ఐ ఆర్–2026 సంవత్సరానికి గాను హోటల్ అందరూ వాలంటరీగా ముందుకు వచ్చి సంబంధిత బి ఎల్ ఓ గారిచే ఓటరు మ్యాపింగ్ చేసుకోవాలని తాసిల్దార్ సత్యనారాయణ చెప్పారు. గురువారం ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలోని ప్రజా ఐక్యవేదిక లో సర్వసమాజ్ సభ్యులకు, ప్రజలకు తాసిల్దార్ సత్యనారాయణ అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సర్వ సమాజ్ అధ్యక్షుడు కొట్టాల సుమన్, సభ్యులు పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తామని వారు హామీ ఇచ్చారు. ఓటరు మ్యాపింగ్ చేసుకోకపోతే ఓట్లు తీసివేసే అవకాశం ఉందని, ఓటరు మ్యాపింగ్ వచ్చే అధికారులకు పట్టణ ప్రజలు సహకరించాలని తాసిల్దార్ కోరారు.

Ho no:LIG-32,, Ph No:- 9247842354, 9059207979,near water tank, Bharat Nagar colony, moos-apet, Hyderabad, pin code 500018.